వినోదా వారి

# దేవదాసు

## సినిమా నవల

అక్కినేని 70 వసంతాల నటజీవితానికి
నవనవోన్మేష దర్పణం!



Creative Links
PUBLICATIONS

# శరత్ సృష్టికి దృశ్యరూపం

తెలుగులో సాంఘిక చిత్రాల నిర్మాణం ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు తెరపైకి వచ్చిన చిత్రాలను ఒకసారి గుర్తుచేసుకుంటే ఎన్నో మరపురాని చిత్రాలు మనకళ్ల ముందు కదలాడతాయి. వీటిలో 'దేవదాసు' ఒకటి. దీని విజయం తెలుగు చలన చిత్ర చరిత్రలో ఒక అపూర్వఘట్టం.

శరత్ సృష్టించిన కథకు ఒక రూపం కల్పించి తమ సమష్టి కృషితో చిత్రంలోని ఆయా పాత్రలకు ప్రతి సృష్టి చేసారు డి.యల్.నారాయణ, వేదాంతం రాఘవయ్య, సుబ్బురామన్, ఘంటసాల, బి.యస్.రంగా ప్రభృతులు.

'దేవదాసు' వంటి విషాదాంత చిత్రం యింతవరకు మన చిత్రసీమ నుండి వెలువడిన చిత్రాలలో లేదు; అంత ఉత్తమమైనది అంటే అతిశయోక్తి కాదు. 'దేవదాసు' పాత్ర పోషణలో అక్కినేని నాగేశ్వరరావు నటనను బారువా, సైగల్‌ల నటనకంటే ఉత్తమంగా ఉండి దిలీప్‌కుమార్ వంటి నటుని ప్రశంసలందుకుంది. వెండితెరపై దేవదాసు పాత్రలో నాగేశ్వరరావును చూస్తుంటే యిప్పుడు శరత్ జీవించివుంటే నాగేశ్వరరావు నటనను, హావభావాలను తెరమీద చూస్తే తన నవలలో ఏవైనా కొన్ని మార్పులు చేసుకొనే వాడేమోనని అనిపించకమానదు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో యీ చిత్రంతో ఒక నూతన శకం ప్రారంభమైంది. 'దేవదాసు' పాత్రలో ఉన్న సుగుణాలు మరపురానివి. శరత్‌బాబు తన సమకాలీన సంప్రదాయాలను గౌరవిస్తూ దేవదాసులో అటువంటి సుగుణాలను ఆపాదించటం వల్లనే ఆ పాత్ర అటువంటి శిఖరాలను అందుకొంది. అక్కినేని నాగేశ్వరరావు ఎన్నో గొప్ప చిత్రాలలో నటించినప్పటికీ ఆయన పేరు వినగానే మనకు గుర్తువచ్చే వాటిలో దేవదాసు ఒకటి. ఈ చిత్రం పట్ల ఆయన చూపిన అంకితభావం దీనికి కారణం.

తెలుగు సినిమా ఎనభై వసంతాలు పూర్తి చేసుకుంటున్న సమయంలో నాగేశ్వరావుగారి నటజీవితం డెబ్భై వసంతాలు. ఇది భారతీయ సినిమా చరిత్రలో ఒక అపూర్వమైన విషయం.

ఇంతటి ఘనచరిత్ర కలిగిన యీ చిత్రాన్ని నవలారూపంగానే కాకుండా సాధ్యమైనవంత వరకు యీ చిత్ర విజయంలో పాలు పంచుకున్న వారందరి గురించి వివరాలు గ్రంథస్థం చేయదలచి నాగేశ్వరరావుగారిని సంప్రదించగా వారు సహృదయతతో అంగీకరించినందుకు వారికి మా ధన్యవాదాలు. "దేవదాసు" చిత్రానికి చక్కని శైలితో నవలారూపం కల్పించి, దేవదాసు రచనను తెలుగులోకి అనువదించిన వారి వివరాలను గ్రంథస్థం చేసిన టి.ఎస్.జగన్మోహన్‌గారికి, అలాగే వివిధ భాషల్లో వచ్చిన "దేవదాసు" చిత్రాల విశేషాలను తెలియజెప్పిన వి.ఎ.కె.రంగారావుగారికి, సంగీత విశేషాలను పరిశోధించి వాటి పూర్వాపరాలను తెలియజేసిన డా॥ వి.వి.రామారావుగారికి, వేదాంతం రాఘవయ్యగారి గురించి సరియైన వివరాలు తెలియజేసిన ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారికి, డి.ఎల్.నారాయణగారి కుటుంబ వివరాలను అందజేసిన ఆయన మేనల్లుడి కుమారుడు హెచ్.వి.ఆర్.ప్రసాద్ (సుమధుర కళానికేతన్, విజయవాడ) గారికి, ఏలేశ్వరపు రఘురామశర్మగారికి, రావి కొండలరావు రావుగారికి, కొన్ని ఛాయాచిత్రాలను అందజేసిన సంజయ్ కిశోర్‌గారికి, ఈ చిత్రంలోని సహాయపాత్రధారుల గురించిన వ్యాసాన్ని వ్రాసిన ఎస్.వి.రామారావుగారికి, జె.మధుసూదన శర్మగారికి, డొక్కా శంకర్, పంచకర్ల రమేష్ గార్లకు, డి.టి.పి. చేసిన లక్ష్మీ శ్రీనివాస్‌గారికి, మిత్రుడు వేణుగోపాల్‌కు, పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ముందుకు వచ్చిన 'రాగరాగిణి' సంస్థ నిర్వాహకులకు, వీరందరికీ మా కృతజ్ఞతలు.

ఈ పుస్తకంలో ఎక్కడైనా తప్పులు ఉంటే, తెలిసినవారు సరిదిద్దితే మలి ముద్రణలో సవరించుకోగలము. రాబోయే కాలంలో మరిన్ని విలువైన గ్రంథాలతో మీ ముందుకు రావాలని ఆశిస్తూ...

**3.9.2011** — **క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్**

# మహద్భాగ్యం



స్త్రీలు తరతరాలుగా అనుభవిస్తున్న బాధలను చూసి, వారి మనోవేదనను అర్థం చేసుకుని, సానుభూతితో కలం పట్టి, వారి పక్షాన సాహిత్య సమరాన్ని సాగించిన అకుంఠిత యోధుడు శరత్ చంద్ర ఛటోపాధ్యాయ. ఆ మహనీయుని కలం నుంచి వెలువడిన అసంఖ్యాక రచనలలో 'దేవదాసు' అత్యంత ప్రజాదరణ పొందింది. నాటి నుంచి నేటి వరకూ, వివిధ భాషలలో వెండి తెరని అలంకరించిన ఘనత ఆ నవలకి దక్కింది. సుమధుర సంగీతంతో, నటీ నటుల అభినయకౌశలంతో, వాస్తవికతను ప్రతిబింబించే ఛాయాగ్రహణంతో రూపొందిన 'దేవదాసు' ప్రజాదరణను పొందడంలో ఆశ్చర్యం లేదు!

'దేవదాసు'ని వెండితెర నవలగా మలిచే సమయంలో, ఎన్నోసార్లు నా హృదయం వికలమై, కళ్లు చెమర్చాయి. ఎన్నెన్నోసార్లు నా స్మృతులలో 'శరత్‌బాబు' దివ్యరూపం కదలాడి, మనసు ఆనందంతో పరవశించేది. ఆనందం కలిగిందంటే కలగదూ? ఎక్కడ సాహిత్య ప్రపంచంలో మేరు పర్వతంవంటి శరత్‌బాబు! ఎక్కడ అతి చిన్న అణువు వంటి నేను!

ఆ మహానుభావుని కరకమల స్పర్శతో పునీతమైన దేవదాసును, నవలగా రూపాంతరం చేసే మహద్భాగ్యం నన్ను వరించింది. తన ఆరాధ్య రచయిత రచనని స్పృశించడం అదృష్టం కాదూ?

ఈ మహద్భాగ్యాన్ని, యీ అదృష్టాన్ని నాకు ప్రసాదించిన 'క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్' అధినేతలు సూరిబాబుగారికి, శ్రీకాంత్‌గారికి నా కృతజ్ఞతలు!

- రచయిత

24.6.2011 టి.ఎస్.జగన్మోహన్

# దేవదాసు సృష్టికర్త శరత్‌బాబు - కొన్ని విశేషాలు



'శరత్ చంద్ర ఛటర్జీ' - అనే ఒక చిన్న పుస్తకంలో స్వర్గీయ పురాణం సుబ్రహ్మణ్య శర్మ, యీ విధంగా వ్రాసారు-

"ఒక ఇంటర్వ్యూలో -

'నీ అభిమాన తెలుగు రచయిత పేరు చెప్పమ'ని అడిగాను. ఆ అబ్బాయి టక్కున 'శరత్‌బాబు!' - అని చెప్పాడు. 'రైట్!' - అన్నాను నేను, నవ్వుతూ.

తెలుగువారు 'శరత్‌బాబు'ను ప్రేమించి, గౌరవించినట్లుగా, ఏ తెలుగు రచయితనూ యింత వరకూ అభిమానించినట్లు దాఖలాల్లేవు!

చదువూ సంధ్యా లేని పామరులకు కూడా 'దేవదాసు' డైలాగులు కంఠతావచ్చు. ఎక్కడి బెంగాలు? ఎక్కడి శరత్? ఏనాటి 'దేవదాసు?' తాగుబోతుల్ని - 'మనవాడు దేవదాసై పోతున్నాడ'ని సవిచారంగా రిఫర్ చేస్తారు. రావి చెట్టూ, రామాలయమూ లేని వూరు లేనట్లే, శరత్ పుస్తకం లేని యిల్లు తెలుగుదేశంలో వుండదు!

వానలో తడియనివారూ, శరత్ నవల ఒకటో అరో చదవని వారూ మనలో లేరు! 'శరత్‌బాబు తెలుగువాడు కా'దంటే, మా వాళ్ళు ఆశ్చర్యపోయి నవ్వేసి, ఆ తర్వాత బెంగపెట్టుకున్న రోజులున్నాయి.

శరత్ రచనల్లో దేవదాసు ఒక 'లిరిక్' లాంటిది! అది ఒక 'గీతగోవిందం'. ఈ నవల ద్వారా విఫలప్రేమను చిత్రించడంలో, పాఠకులను ఏడ్పించడంలో, తాను అద్వితీయుడినని శరత్ నిరూపించుకున్నాడు. 'పసుపు తాడు కట్టినంతమాత్రాన వివాహం వివాహం కాద'నీ, 'విఫలమైన ప్రేమకు నైతిక విజయం వుం'దనీ - దేవదాసు కథ రుజువు చేస్తుంది. దేవదాసు ఆవేదనలో విశ్వజనీనత వుంది. వైష్ణవ భక్తి సంప్రదాయానుసారం ప్రేమను మధురభక్తికి అంగంగా శరత్ చిత్రించాడు."

తెలుగువారి మన్ననలని అందుకున్న శరత్‌బాబు 1876వ సంవత్సరంలో, సెప్టెంబరు 15వ తేదీన జన్మించేరు. బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని 'దేవానందపురం' అనే కుగ్రామం ఆయన జన్మస్థలం. శరత్ తండ్రి మోతీలాల్ ఛటోపాధ్యాయ, తల్లి భువన మోహినీదేవి. 'దేవదాసు' నవలలోని పూర్వ భాగమంతా శరత్ బాల్య జీవితానికి సంబంధించిన వృత్తాంతమే!

శరత్ తను చదివే బడిలో గురువుగారయిన పియారీ పండిట్ అనే అతనిని తన నవలలో బడిపంతులు గోవింద పండితుడిగా చిత్రించాడు. శరత్ తండ్రి చాలా మంచివాడు. అయితే, ఆయన లోకం దృష్టిలో బలహీనుడు, అసమర్థుడు. అందువల్ల, సంసార నిర్వహణ బాధ్యత శరత్ నాయనమ్మ, అతని తల్లి తమ భుజాల మీద వహించేరు. పార్వతి తండ్రి పాత్ర శరత్ తండ్రి మోతీలాల్‌కి ప్రతిరూపమే! పార్వతి తల్లి, నాయనమ్మల పాత్రలు, శరత్‌తల్లి, నాయనమ్మలకి మారురూపాలు!

దేవదాసుకు లాగే శరత్‌కి చిన్నతనంలో బడి అంటే యిష్టం ఉండేది కాదు. తోటలలో చెట్లు ఎక్కడం, చెరువుల్లో చేపలు పట్టడం ఆయనకి బాల్యంలో బాగా అలవాటు! శరత్ చదువుకునే పాఠశాలలో, ఆయనకి ఒక అద్భుతమైన సహాధ్యాయిని ఉండేది. ఆ పిల్ల ఆయనకు అన్ని పనుల్లోనూ తన అండదండలను అందించేది. శరత్‌కి పాఠశాలలో ఎవరితోనూ పడేది కాదు. ఆయన అందరితోనూ గిల్లికజ్జాలు పెట్టుకునేవాడు. అయితే, ఆ ఆడపిల్ల మాత్రం, మంచీ చెడూ అనే విచక్షణ లేకుండా, అన్నిట్లోనూ ఆయనకి తగిన సహచారిగా ఉండేది. ఆ పిల్ల వుంటే

ఆయనకి ప్రాణాలు లేచివచ్చేవి. అయినా, శరత్‌కి కోపమొస్తే, ఆ చిన్నపిల్లను చావచితక్కొట్టేవాడు. ఆ పిల్ల శరత్ ఎంత కొట్టినా, తిట్టినా భరించేది. ఆ ఉభయులూ యిట్టే పోట్లాడుకుని, అట్టే మళ్లీ కలిసిపోయేవారు. ఆ పిల్ల మీద గాఢాభిమానం చేత, శరత్ పెద్దయ్యాక ఆమెనే 'పార్వతి' పాత్రగా తీర్చిదిద్దాడు. తన బాల్యకాల సఖిని సాహిత్యంలో ధ్రువతారగా నిలిపాడు. శరత్తే చిన్నప్పటి దేవదాసుగా అవతరించేడు.

శరత్‌కి తండ్రి అంటే ప్రాణం! లోకం తన తండ్రిని అసమర్థుడిగా భావించినా, శరత్ ఆయనని అభిమానించి, పెద్ద దేవదాసులో ఆయననూ, ఆయన బలహీనతలనీ నిక్షిప్తం చేసి, చునీలాల్ పాత్రలో మోతీలాల్‌కి శాశ్వతత్వాన్ని కలిగించాడు. అసమర్థులను అసహ్యించుకునే హీనస్థితి, మానవ సమాజాన, శరత్ రూపుమాపాడు.

కలకత్తా నగరంలో అనేకమంది వేశ్యలను గురించి, వారి నికృష్ట జీవన పరిస్థితులను గురించి, శరత్‌కి బాగా తెలుసు. చంద్రముఖి వంటి వేశ్యలను ఆయన చాలామందిని చూసాడు. వారితో మాట్లాడి, వారి జీవిత విషాదాన్ని స్పష్టంగా గ్రహించాడు. ఆ దుఃఖభాగినులకు ప్రతినిధిగా, చంద్రముఖి పాత్రను ఆయన రూపొందించారు. ఆమె 'చింతామణి', 'వసంతసేన', 'మధురవాణి' - వంటి వేశ్యారత్నాల కోవకి చెందుతుంది.

చంద్రముఖి పాత్ర, దేవదాసు - పార్వతుల అమరప్రేమకథలో, పానకంలో పుడకలా అడ్డుపడదు! ఆమె వారి ప్రేమ ఔన్నత్యాన్నిలోకానికి వేనోళ్ల చాటి చెప్తుంది! శరత్ నవలల్లో ముఖ్యపాత్రల మధ్య సంఘర్షణ పరాకాష్ఠని అందుకుని, ఆ పాత్రల మధ్య ఒక పెద్ద అగాధమేర్పడుతుంది. అక్కడ... ఆ అగాధాన్ని పూరించడానికి ప్రవేశపెట్టిన పాత్ర, ఆచితూచినట్లుగా తన పాత్రను నిర్వహిస్తుంది. 'చంద్రముఖి' పాత్ర అటువంటిదే! పార్వతి ప్రేమమయి! చంద్రముఖి త్యాగమయి! ఆమెను మర్చిపోవడం, మానవమాత్రులకు అసాధ్యం!

సాహిత్యంలో ఒక మహత్తర కళాఖండంగా నిలిచిపోయిన దేవదాసు నవలను శరత్ తన 16వ ఏట రచించాడు. 1892 ప్రాంతంలో, 'శిశువు' అనే లిఖిత మాసపత్రికలో దేవదాసు మొదట వచ్చింది. శరత్‌కి యీ నవల పట్ల ఏ మాత్రమూ సదభిప్రాయం లేదు! చెడును ఆకర్షణీయంగా చిత్రించి, తప్పుచేసానేమోనని శరత్, యీ నవలను గురించి చింతించాడు. (గురజాడ తన 'కన్యాశుల్కం'ని గురించి కూడా యిలాగే భావించాడు.) అందువల్లనే, శరత్‌కి యీ నవల ప్రచురణ కావడం యిష్టం లేక, తన మిత్రుడైన సౌరేంద్ర ముఖర్జీ యింట, పాతపెట్లో వ్రాతప్రతిని పడేసాడు. ఆ మిత్రుడు తన వద్దనున్న శరత్ బాల్య రచనలను, అతనికి తెలియకుండా, రహస్యంగా 'యమున' - అనే మాసపత్రికకి పంపించాడు. సాహిత్యలోకంలో శరత్ పేరు మార్మోగేలా చేసిన ఘనత, అతని మిత్రుడు సౌరేంద్ర ముఖర్జీకే దక్కుతుంది.

ప్రప్రథమంగా శరత్ రచనలను, అనువదించినవారు శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి. ఈయన దేవదాసు నవలను, 1925 - 1930 సంవత్సరాల మధ్య, 'శ్యామల' పేరిట తెలుగులో, తొలిసారి అనువదించారు. కలకత్తాలో విద్యనభ్యసించే కాలంలో, బెంగాలీ భాషను నేర్చుకుని, తెలుగువారికి శరత్ రచనలను, మొట్ట మొదట చవిచూపిన గౌరవం వీరిదే! అయితే, వీరిది గ్రాంథిక భాష!

సత్యనారాయణగారికి భిన్నంగా చక్రపాణి చక్కని వ్యావహారిక భాషలో తెలుగులో అనువదించారు. 'ఆంధ్రజ్యోతి'లో చూడచక్కని బొమ్మలతో, పెద్ద అక్షరాలతో ధారావాహికంగా ప్రచురింపబడి, ఆపై పుస్తకరూపంలో కూడా వెలువడింది. చక్రపాణి కూడా బెంగాలీ నుంచే తెలుగులోకి అనువదించారు.

శరత్ జీవించివున్నప్పుడే, ఆ మహాత్ముని నుంచి వారి రచనలను తెలుగులోకి అనువదించడానికి అనుమతిని పొందినవారు వేలూరి శివరామ శాస్త్రిగారు. వీరు గాక - గద్దె లింగయ్య, మద్దిపట్ల సూరి, కృత్తివాసతీర్థులు, నన్నపనేని సుబ్బారావు, పురాణం కుమారరాఘవశాస్త్రి, దిగవల్లి శేషగిరిరావు, బొందలపాటి శివరామకృష్ణ - వంటి సాహిత్యవేత్తలెందరో 'దేవదాసు' నవలను అనువదించారు.

మహర్షి అరవిందులు, దేశ బంధు చిత్తరంజన్ దాసుల వంటి మహితాత్ముల మన్ననలను పొందిన మహోత్తమ సాహిత్యవేత్త శరచ్చంద్రుడు!!!

# నిండా స్తుతి

**- వి.ఎ.కె.రంగారావు**



'దేవదాసు' రోజుల్లో వి.ఎ.కె. రంగారావు

ఫోటో : శివం

వినోదా వారి 'దేవదాసు' విడుదలైన 58 సంవత్సరాలకు యీ కైవారగీతం పాడటానికి రెండు కారణాలు. షష్టిపూర్తి చేసుకొనే సమయంలో కూడా సర్వాంగసుందరంగా, సొగసుజూడతరమా అన్నట్లిది శోభిల్లడం. ఇప్పటికి అయిదు భాషల్లో తయారైన పదకొండు (+ ఒక మూకీ) చిత్రాలలో దీనికి వచ్చిన పేరూ ప్రతిష్ఠా మరే చిత్రానికీ రాకపోవడం.

నేనీ 'దేవదాసు'ల్లో ఎనిమిదింటిని చూశాను. ప్రతిదానిలో ఏదో ఒక ప్రత్యేకాకర్షణ యిప్పటికీ సూదంటురాయిలా వుంది. ఒకదానిలో సంగీత సాహిత్యాలు (ఆరుద్ర - రమేశ్ నాయుడు / విజయనిర్మల-1974), యింకోదానిలో స్క్రీన్-ప్లే (పి.సి.బరువా/ పి.సి.బరువా-1935, హిందీ), ఛాయాగ్రహణం (కమల్ బోస్ / బిమల్ రాయ్-1955, హిందీ), మొట్టమొదటి టైటిల్ కార్డు నుంచి చిట్టచివరి సమాప్తం కార్డు వరకూ ప్రౌఢ స్థాయిలో పటాటోపం (సంజయ్ లీలా భన్సాలి, 2002, హిందీ), భగవాన్-చునీలాల్గా అమోఘ నటన (ఉత్తమ్ కుమార్/దిలీప్ రాయ్-1979, బెంగాలీ); యిలా అన్నిటిగురించీ ఒక ప్రత్యేక దీప్తిని ఎంచి చూపవచ్చు.

కాని యీ అన్ని పరిధులను దాటి, ప్రేక్షకుల మనసుపై చెరగని ముద్ర వేసింది వినోదా వారి 'దేవదాసే', నిస్సంశయంగా. నేనీమాట ఒక ఆంధ్రుడిగా మాతృభాషాభిమానంతో చెప్పడంలేదు. అరవై అయిదు సంవత్సరాలుగా పలు భాషల్లో వేల సినిమాలు చూసి సినిమా కళ అంటే ఒక స్పష్టమైన దృష్టినేర్పరుచుకొని అంటున్నమాట.

స్వర్ణయోగం సిద్ధించటానికి కారణాలు సవాలక్ష. అలాగే యీ చిత్రమిలా బంగారమయిదంటే దాని వెనుకనున్న తారాబలం, సాంకేతిక బృందమే కాక మరొక అంశం అదృష్టం, అన్నీ అలా అందంగా కలిసిరావడం. ఆ యోగానికి ఒక్కరినే వేలెత్తి చూపమంటే, కాదు బలాత్కరిస్తే దర్శకుడు (వీరికి సంగీత, నృత్య, సాహిత్యాభినయాలు వంశపారంపర్యంగా వచ్చి, కృషితో చేతికందిన కల్యాణసౌగంధికాలు) వేదాంతం రాఘవయ్యనే పేర్కొనాలి. ఆ మరుసటి సంవత్సరమే వీరి దర్శకత్వంలోనే వచ్చి, అందరినీ నిరుత్సాహపరచిన 'అన్నదాత' మాటేమిటి అని అడిగితే నేనొక ఋషివాక్యాన్నే ఉదాహరించగలను: 'చినికిన చినుకెల్ల మంచి ముత్యము కాదు' (మల్లాది రామకృష్ణశాస్త్రి - చివరకు మిగిలింది/రామినీడు, 1960).

సాంకేతిక వర్గంలో ప్రతి ఒక్కరూ తాము చేయవలసింది నిష్కళంకంగా చేశారు. తేటతెల్లంగా కనబడే ఛాయ, కళ, మేకప్, వస్త్రాలంకరణలే కాక గాలి తెచ్చే గంధంలా తెలిసీ తెలియక అలముకొనే నృత్యరచన, నేపథ్య సంగీతము, కూర్పు కూడా ఒకదానికొకటి తోడైనాయి.

నేను మొట్టమొదట 'దేవదాసు' చూసింది మొదటి విడుదలకే, 1953లో; స్కూలు క్రికెట్టు జట్టు అఫీషియల్ ఫోటోగ్రాఫర్గా బెంగుళూరు వెళ్లినప్పుడు. చివరనే కాదు ఎన్నో సన్నివేశాలలో కన్నీళ్లు కాలువలై ప్రవహించాయి. ఆ వయసు--నిండా నిండని పధ్నాలుగు--అటువంటిది. ముఖ్యంగా చంద్రముఖి-దేవదాసు వీడ్కోలు సన్నివేశం

గుండెను పిండివేసింది. ఎన్నో సంవత్సరాల తరువాత విజయవాడ మాడర్న్ కఫేలో వుంటూ దగ్గరున్న ఎ.సి. హాలులో చూడని 'సీతారామయ్యగారి మనవరాలి'ని వదులుకొని దూరంగా బెంజ్ సర్కిల్ అవతల వున్న పాత హాలులో, ఆ హోటలు మేనేజరు సైకిలు తీసుకొని వెళ్లి, రాత్రి ఆటను చూసినప్పుడు – అదే ఉత్పాతం. అదే యీ 'దేవదాసు' గొప్పతనం.

ఒకటి రెండు ముచ్చట్లు అందరికీ తెలియనివి చెప్పి, యీ వందిమాగధీయాన్ని ముగిస్తాను.

'దేవదాసు' పాటల్లో మల్లాది వారి హస్తం ఉందనే మాట పాతదే. దీనికి ఉదాహరణగా 'అందాల ఆనందం', 'కుడి యెడమైతే' పాటలను పేర్కొంటారు. 'తాగినోడి మాటకర్థం వెతకాలా' అని ఒక రిక్షావాడడగడం కట్టుకథని ప్రతిభాశాస్త్రి నాతో స్వయంగా చెప్పారు. అవటుపెడితే, మూడుచోట్ల సంభాషణల్లో నాకు ఆ రామకృష్ణుడే ప్రత్యక్షమౌతాడు.

"నువ్వెందుకే యీ గీత గోవిందం?" (నాయనమ్మ, పుట 25).

"నమస్కారం మహాప్రభో! నాకు సెలవిప్పించండి. ఇహ నేనీ 'ప్రహ్లాద' నాటకం ఆడలేను!" (బడిపంతులు, పుట 31).

"అయ్యయ్యో! అదేం పరధ్యానమే తల్లీ? నాకు తలంబ్రాలు పోస్తావేమే!" (నాయనమ్మ, పుట 38).

సినిమా రచయితగా సముద్రాల రాఘవాచార్యులు మల్లాది రామకృష్ణశాస్త్రి ప్రక్కన ఆచంట మల్లన్నే, సందేహం లేదు. కాని పై మూడూ సముద్రాల కాదు గదా తన మగని నాలిక దిగివచ్చిన చదువులతల్లీ వ్రాయలేదు. కస్తూరి, పునుగు, జవ్వాదుల ఘాటు లేకపోవచ్చు. కాని వట్టి వేరు మట్టి వాసన, చల్లని పరిమళం, దానిదే. మల్లాది వారి సంభాషణలు పాత్రలకు సహజాతాలు.

'దేవదాసు' కోసం రికార్డు చేసి అందులో ఉపయోగించని పాటొకటున్నది. అది 'వినవేడుక" (ఆర్కే బుక్స్, 2005, వెల రూ. 100/–) పుస్తకంలో 26వ పుటలో ఉంది.

ఏరు నవ్విందోయ్ ఊరు నవ్విందోయ్
ఏటిలోన చిట్టి చేప యిట్టే నవ్విందోయ్
గట్టున చిట్టి పాప అట్టే నవ్విందోయ్ ॥ఏరు॥

ఏరు మీద ఊరు, ఊరు మీద ఏరు
ఏరు మయాన పాలేరు
గరప చేనుమీద మిరపపండు చూసి
దొరబిడ్డ ఉలుకెత్తి దొండపండనుకుంటే ॥ఏరు॥

నిమ్మకు నీరెట్టి చేనుకు నారెట్టి
సమ్మతైనావోడు నిదరోతే
కంటినిద్దుర రాక ఒంటిపొద్దూ పోక
ఏమి తోచని పిల్ల ఏతామెక్కిందని ॥ఏరు॥

ఈ పాట వినోదావారి 'దేవదాసు' కోసం సి.ఆర్. సుబ్బురామన్‌కి పాడినట్లుగా మాధవపెద్ది సత్యం నోటు బుక్కులో వుంది. ఆ పాట బోళ్ల సుబ్బారావు ప్రథమ చిత్రం 'పల్లెపడుచు'లో ఉపయోగించుకొన్నారు. ఈ సినిమా

పాటలతోనే విడుదలలైన రికార్డు పైనా వినోదా వారి సౌజన్యంతో అనీ, రచన మల్లాది రామకృష్ణశాస్త్రి అనీ వుంది.

ఇదంతా నాకు తెలిసేటప్పటికి డి.ఎల్.నారాయణ, వేదాంతం రాఘవయ్య లేరు. ఉన్న ప్రతిభాశాస్త్రి, పేకేటి శివరాం, అక్కినేని నాగేశ్వరరావు యీ పాట సంగతే తెలియదన్నారు.

పాట రచన బట్టి ఏ సన్నివేశం కోసం చేశారా అని ఆలోచిస్తే, ఏదీ తేలడం లేదు. వరసా, వాద్యగోష్ఠి గమనిస్తే, ఒక పడవవాని పాటై వుండవచ్చు అనిపిస్తున్నది. ఒకవేళ బెంగాలులో చిన్న చిన్న నదులు చిలవలు పలవలుగా వుండటం దృష్టిలో పెట్టుకొని, తండ్రి చనిపోయిన తరువాత దేవదాసు సొంత వూరు వచ్చే తరుణంలో, పార్వతీ ప్రయాణం కట్టిన సన్నివేశానికా? ఇవన్నీ తలపోతలే.

చివరి మాట. విజయనిర్మల 'దేవదాసు'తో బాటు వినోదా వారిది కూడా విడుదల చేయబడి బాగా ఆడటంతో అన్ని పాటలతో ఒక ఎల్.పి. కొలంబియా లేబిల్‌పైన సరస్వతీ స్టోర్స్ వారు విడుదల చేశారు. వివరాలన్నీ తప్పుల తడకలు. ఆ పాటలు మొదట విడుదల చేసింది హెచ్.ఎం.వి. ఈ తప్పులు దిద్దమని సరస్వతీ స్టోర్స్ కణ్ణన్‌ని అడిగితే, అవి మాకు హెచ్.ఎం.వి వాళ్లిచ్చారు, అవే కరెక్టు, మార్చడం కుదరదన్నారు. గ్రామకో మంగాపతినడిగితే అది కొలంబియా విడుదల, నేను చేయగలిగిందేమీ లేదు అని చేతులెత్తేశారు. తప్పించుకు తిరుగువాడు ధన్యుడని బద్దెన యేనాడో అన్నాడు కదా తన సుమతీ శతకంలో! వసుదేవుణ్ణయినా ఫలితం లేకపోయింది.

అప్పుడు మద్రాసు విజయ–వాహిని స్టూడియోలో షూటింగ్‌కని అక్కినేని వున్నారు. ఆయన చేతులు పట్టుకొన్నాను, మధ్యాహ్నం విశ్రాంతి వేళ భంగం కలిగించి. 'మీరు రెండు మాటలు చెప్పిన దేవదాసు ఎల్.పి. యిన్ని తప్పుడు వివరాలతో విడుదల చేశారు. నేను మర్యాదగా అడిగితే మాట వినడం లేదు ఆ గ్రామ, యింటి సింహాల వాళ్లు. ఏయే దిద్దుబాట్లు చేయాలో మీరు వ్రాసినట్లు ఆ కంపెనీల వారికి ఒక ఉత్తరం టైపు చేసి తీసుకువచ్చాను. మీరు సంతకం పెట్టండి' అంటూ అభ్యర్థించాను.

ఒకసారి చదివి సంతోషంగా సంతకం పెట్టారు. ఆ ఉత్తరం చివరి పేరాలో 'ఈ సరియైన వివరాలు వి.ఎ.కె. రంగారావు యిచ్చినవని కొత్త విడుదలపై వుండాలి' అని వుంది. అలాగే ఆ ఈస్టిండియా కుంఫిణీ వారు బ్రతికినట్టు విడుదలైన కేసెట్టులో వేశారు. ఇప్పుడా కౌటిల్యులా విషయం తొలగించే వుంటారు.

ఆ విజయం నాకు జరిగిన కనకాభిషేకంలో ఒక నాణెం. ఇప్పుడీ లోకంలో లేనివారికి జరుగుతున్న అన్యాయాన్ని నిలువరించడం కన్నా ఆనంద్‌కి ఆనందమేమున్నది! నాకీనాడు పేరుప్రతిష్ఠలున్నవంటే దీనికి కారణం వారు కట్టిన సరాగమాలలే కదా!

ఇలాంటి పాత చిత్రాల సంభాషణలు నవలా రూపంలో రావడం ఆ కర్తలకు నివాళి. ఆ కార్యానికి దాఖలా. నేటి ప్రేక్షక పఠితలకు పచ్చకర్పూరం వేసిన కొట్టబియ్యపు పాయసం. ఎత్తండి. గుర్తించండి. ఆస్వాదించండి.

**– వి.ఎ.కె.రంగారావు**

**13.5.2011**

**V.A.K. RANGA RAO**
Ram Mahal, 36 Pycroft's Gardens
Madras 600 006/10
044 28278308
94447 34024 TN
99511 68911 AP

## పాత్రలు - పాత్రధారులు

| | | |
|---|---|---|
| నాగేశ్వరరావు | : | దేవదాసు |
| సావిత్రి | : | పార్వతి |
| సుధాకర్ | : | చిన్న దేవదాసు |
| బేబి అనూరాధ | : | చిన్న పార్వతి |
| లలిత | : | చంద్రముఖి |
| ఎస్.వి. రంగారావు | : | జమీందారు నారాయణరావు |
| సి.యస్.ఆర్ | : | జమీందారు భుజంగరావు |
| అన్నపూర్ణాదేవి | : | నారాయణరావు భార్య |
| పేకేటి శివరాం | : | భగవాన్ |
| దొరైస్వామి | : | నీలకంఠం |
| ప్రభావతి | : | నీలకంఠం భార్య |
| ఆరణి సత్యనారాయణ | : | ధర్మన్న |
| జి.వి.జి.కృష్ణ | : | మహేంద్రుడు (భుజంగరావు పెద్దకొడుకు) |
| చంద్రకుమారి | : | భుజంగరావు పెద్దకూతురు |
| సీత | : | మనోరమ |
| సురభి కమలాబాయి | : | నీలకంఠం తల్లి |
| మాస్టర్ కుందు | : | వెంకన్న |
| ఆర్.నాగేశ్వరరావు | : | ద్విజదాసు (నారాయణరావు పెద్దకొడుకు) |
| రంగస్వామి | : | ఉపాధ్యాయుడు |
| కంచి నరసింహారావు | : | పురోహితుడు |
| సీతారాం | : | బండివాడు |
| కురుమద్దాలి రామచంద్రరావు | : | వైద్యుడు |
| మహంకాళి వెంకయ్య | : | అప్పు యిచ్చినవాడు |

- యింకా -

బి.యస్.ఆర్.కృష్ణ, డబ్బాచారి, విజయలక్ష్మి, కమల, లక్ష్మి

# సాంకేతిక వర్గం

| | | |
|---|---|---|
| కథ | : | శరత్‌బాబు రచించిన బెంగాలీ నవల |
| మాటలు | : | సముద్రాల రాఘవాచార్య |
| పాటలు | : | సముద్రాల రాఘవాచార్య, క్షేత్రయ్య |
| సంగీతం | : | సి.ఆర్.సుబ్బురామన్ |
| నేపథ్య సంగీతం | : | విశ్వనాథం - రామమూర్తి |
| ఛాయాగ్రహణం | : | బి.యస్.రంగా |
| శబ్దగ్రహణం | : | కె.రామచంద్రన్ |
| కళ | : | వాలి, గొడ్‌గాంకర్ |
| నృత్యం | : | వేదాంతం రాఘవయ్య |
| కూర్పు | : | పి.వి.నారాయణ |
| అలంకరణ | : | ఎస్.మంగయ్య, హరిపాద చందర్, నారాయణస్వామి, జోసెఫిన్ |
| దుస్తులు | : | కె.అచ్యుతరావు, వి.ఎస్.మూర్తి |
| స్టిల్స్ | : | ఆర్.ఎన్.నాగరాజరావు, ఆర్.వెంకటాచారి |
| నేపథ్యగానం | : | ఘంటసాల, రావు బాలసరస్వతీ దేవి, జిక్కి, కె. రాణి, జమునారాణి, ఉడుత సరోజిని |
| స్టూడియో | : | రేవతి, నరసు |
| సమర్పణ | : | వినోదా |
| నిర్మాణము | : | యస్.అప్పలాచారి, జి.సీతాపతిరావు |
| దర్శకత్వం | : | వేదాంతం రాఘవయ్య |
| నిర్మాత | : | డి.యల్.నారాయణ |

## ఇతర సాంకేతిక నిపుణులు

| | | |
|---|---|---|
| ప్రోసెసింగ్ | : | విక్రమ్ స్టూడియోస్ లేబరేటరీస్ లిమిటెడ్ |
| రికార్డింగ్ | : | వెస్టర్న్ ఎలక్ట్రిక్ రికార్డింగ్ |
| సహాయ దర్శకులు | : | పి.వి.నారాయణ, వి.రామారావు, సి.హెచ్.ఎస్.రాజు |

## సహాయకులు

| | | |
|---|---|---|
| ఛాయాగ్రహణం | : | వి.చిదానందం, బి.యన్.హరిదాస్, వి.కుటుంబరావు టి.వి.సుబ్రహ్మణ్యం |
| అలంకరణ | : | ఎన్.ఆర్.దేవు |
| కూర్పు | : | టి.జి.రాజగోపాల్ |
| శబ్దగ్రహణం | : | ఎన్.ఎ.జగన్నాథన్, కె.శ్రీకాంత |
| నిర్వహణ | : | వి.యస్.రంగనాథన్ |

చిత్రం నిడివి : **17236** అడుగులు    సెన్సార్ సర్టిఫికెట్ నెంబరు : **8107**    విడుదల తేదీ : జూన్ **26, 1953**

# దేవదాసు

దేవదాసు రావులపల్లి జమిందారు నారాయణరావు చిన్న కొడుకు. పొరుగింటి నీలకంఠం కూతురు పార్వతి. వారిద్దరికి అలవిమాలిన స్నేహం. ఆడినా, పాడినా ఒక్కచోట. ఒక్క బడిలోనే చదువుకుంటున్నారు.

ఒకరోజు......

రావులపల్లి గ్రామంలో పాఠశాల.....

తరగతిలో మాస్టారు కునుకు తీస్తున్నాడు. క్లాసు లీడరు భోగన్న బెత్తం పట్టుకుని, మేస్టారికి నిద్రాభంగం కాకుండా, పిల్లల్ని అదుపు చేస్తున్నాడు. మేస్టారి కుర్చీకి కాస్త దూరంలో, అతను ఓ బెంచిపై కూర్చున్నాడు.

క్లాసులో మిగతా పిల్లలకి కొంచెం ఎడంగా దేవదాసు, పార్వతి కూర్చుని, పలకల మీద యేదో రాయసాగారు. దేవదాసు రాసింది తుడిపేసి, పార్వతితో "ఏయ్! ఊఁ!"- అంటూ, బయటికి పోదామని సైగ చేసాడు. పార్వతి సద్దు చేయొద్దని సైగ చేసి, భోగన్నని చూపించింది, అతనికి. అప్రమత్తంగా వుండే భోగన్న, వాళ్ళని బెదిరిస్తూ, బెంచిమీద బెత్తంతో కొట్టాడు. దేవదాసు, పార్వతి మళ్లీ రాయడంలో పడ్డారు.

 

పార్వతి పలకపై మేస్టారి బొమ్మేస్తూ, మధ్యలో తలెత్తి, ఆయన్ని చూస్తూ, ముసిముసినవ్వులు చిందిస్తోంది. దేవదాసుకి చాలా చిరాగ్గా వుంది. ఆలోచించగా, అతనికి ఓ ఉపాయం తట్టింది. పలక పట్టుకు నిలబడి-

"లెక్కకుదరలేదు!"- అని భోగన్నకి చెప్పేడు.

"ఏం లెక్క?"- అని భోగన్న కోపంగా అడిగాడు.

"మణుగుల్లెక్క!"- దేవదాసు చెప్పాడు.

బెత్తాన్ని ఝుళిపిస్తూ- "ఏదీ పలక తీసుకురా!"- అన్నాడు భోగన్న. దేవదాసు మెల్లగా అతని చెంతకి వచ్చాడు. పలక అతనికి యిచ్చి, ప్రక్కన నిల్చున్నాడు. ఆ లెక్కని బయటికి చదువుతూ భోగన్న-

"ఒక మణుగు నూనె ఖరీదు పద్నాలుగు రూపాయల, తొమ్మిదణాల, మూడు పైసలైతే..... పై...స...లై...తే?- అంటూ బుర్ర గోక్కోసాగాడు. అతను కూర్చున్న బెంచి వెనుక సున్నం పోగుంటే, దేవదాసు దానినే చూడసాగాడు. భోగన్న లెక్క చూసే సమయంలో, దేవదాసు తగిన అదను కనిపెట్టి, బెంచి పైకెత్తేడు. 'దబ్బున' శబ్దం! సున్నం గుట్టలో భోగన్న పడున్నాడు.

పార్వతి నేలనపడి, నవ్వసాగింది. బయట పిల్లలు ఆడుకుంటున్నారు. పార్వతి నవ్వలేక పొట్టచెత్తో పట్టుకుంది. నిద్ర పోతున్న మేస్టారు ఉలిక్కిపడుతూ లేచి, ఏం జరిగిందో పాలుపోక, అటూ యిటూ చూసి-

ఆఁ ! ఆఁ ! ఏంటే, ఏమైంది?"- అని అడిగాడు.

ఎవరో పిల్లాడు బయటికి పరిగెత్తాడు. సున్నపు కుప్పలో నుంచి అతి కష్టంమీద భోగన్న లేవగా, అతని చేయిపట్టుకొని, మేస్టారు కోపంగా-

"హోరి గుంట వెధవా! నువ్వేనా?"- అన్నాడు- ఒళ్లంతా సున్నంతో దెయ్యంలావున్న భోగన్న చుట్టూ పిల్లలు మూగి, చిత్రం చూడసాగారు. భోగన్న ఏడుస్తూ-

"ఊఁ ! ఊఁ ! నేను కాదు సార్!" అని ఏదో చెప్పబోతూ ఉండగా, మేస్టారు అడ్డుకొని- "సిగ్గులేక యింకానూ!" అని కసిరాడు.

"లేదుసార్! దేవదాస్ నన్ను పడేసి... వూఁ ! వూఁ ! వూఁ ! పరుగు పెట్టేడు!"- ఏడుస్తూ భోగన్న అస్పష్టంగా చెప్తుంటే, మేస్టార్కి చిర్రెత్తు కొచ్చింది. "ఇంకా యింకా పితూరీలు కూడానా?"- అంటూ ఆయన భోగన్నని గద్దించాడు. భోగన్న ఏడుస్తూనే-

"కాదుసార్! వాడే సార్! లెక్కరాలేదని వంకపెట్టి, నన్ను పడదోసి పారిపోయేడు, సార్! ఏ... ఏ... నేనేమీ చేయలేదు, సార్!" అంటూ జరిగిన సంగతి అంతా ఆయనకి వివరించాడు. దాంతో మేస్టారికి దేవదాసుపై బాగా కోపమొచ్చి-





“ఊఁ ! పడదోసి పారిపోయినాడుగా!” అన్నాడు, సాలోచనగా.

“అవును, సార్!”- అంటూ చేతులు జోడించి మరీ భోగన్న విన్నవించాడు.

“హూఁ ! వాడి తలతిక్క నేను వదులుస్తా!”- అంటూ తర్జనిని ఊపి, అయ్యవారు శపథం చేసారు. ఆ తరువాత, పిల్లల దెసగా తిరిగి- “ఏయ్ వెంకన్నా! మీరంతా వెళ్లి, దేవదాసుని కట్టి లాక్కురండ్రా!”- అంటూ వారిని ఆదేశించాడు, ఆవేశంగా. వెంటనే, వెంకన్న మహా ఉత్సాహంగా- “పదండ్రా! పదండ్రా!”- అంటూ పొలోమని పిల్లలంతా బయటికి పరుగు లంకించుకున్నారు. పార్వతి మాత్రం పంతులుగారి చెంతనే నిలుచుంది జరిగే చిత్రం చూస్తూ.

✣ ✣ ✣

స్కూలు ఆవరణ ముందు దేవదాసు పరుగు తీస్తూ ఉన్నాడు. అతనికి అల్లంత దూరంలో అతని తోటి విద్యార్థులు-”దేవదా! దేవదా! ఆగు! ఆగు! పట్టుకోండి! పట్టుకోండి!”- అంటూ గోలగోలగా అరుస్తూ, దేవదాసు వెంటపడ్డారు. దేవదాసుకి ఎదురుగా కంకర్రాళ్ల కుప్ప ఒకటి కనిపించింది. మరుక్షణం, దేవదాసు ఆ కంకర రాళ్లను, బలం కొద్దీ వాళ్లమీదకు విసరసాగేడు.

✣ ✣ ✣

పిల్లలంతా విలవిలాడుతూ, మరల తరగతి గదిలోకి ప్రవేశించారు. అయ్యవారికి- “దేవదాసు చిక్కలేదు సార్!” అంటూ వాళ్లు చెప్పారు. పంతులుగారు ఒక్క ఉదుట్న కుర్చీలోంచీ లేచి, వాళ్ల దగ్గరకి వస్తూ-

“ఏమైనాడురా?”- అని ఆశ్చర్యంగా అడిగాడు. ఆ పిల్లల జట్టుకి నాయకుడైన వెంకన్న, తమ గోడును అయ్యవారికి వినిపిస్తూ-

“మా మీద రాళ్ల వాన కురిపించి, పారిపోయినాడు, సార్ ! నా మొగం చూడండి, సార్!” - అంటూ దీనస్వరంతో, రక్తం కారుతున్న తన మొహాన్ని పంతులుగారికి చూపించాడు. వెంకన్నకే కాకుండా, మిగతా పిల్లలకీ రాళ్ల దెబ్బలు తగిలి, రక్తం కారుతూ ఉంది. ఉపాధ్యాయుడు వాళ్లను చూసి, ఆగ్రహంతో-

‘ఎంత జమీందారుగారి కొడుకైతే మటుక్కు యింత అనురెబ్బా? అఘాయిత్యమా?’ అని అయ్యవారి భావం! ఆపై భోగన్నకేసి తిరిగి- “రా ! రా! భోగన్న! వెళ్లి, ఆ నారాయణరావుగారి తోనే చెబుదాం!” అంటూ విస విసా తరగతి గదిలోంచి ఆ పంతులుగారు బయటికి నడిచాడు. భోగన్న అయ్యవారిని, ఆవు వెంట దూడలా అనుసరించాడు. పెచ్చులూడిపోతున్న గోడమీద, యివాళ్టి యీ శిథిలమైపోతున్న పాతశాల భవనం, ఏ జమీందారు పేరిట స్మారక చిహ్నంగా నిర్మించబడిందో, ఆ జమీందారు చిత్రపటం వేలాడుతోంది. అది నేటి దుస్థితికి మూగ సాక్షి!

✣ ✣ ✣

జమిందారు నారాయణరావు భవనం! సోఫాలో నారాయణరావు దినపత్రికను చదువుతూ, తీరికగా కూర్చున్నాడు. పనివాడు విసనకర్రతో విసురుతూ ఆయన చెంతనిలుచున్నాడు. ఇంతలో.. ఆ యింట చాలాకాలం నుంచి పనిచేస్తూ ఉన్న ధర్మన్న అనే సేవకుడు అటుగా వచ్చాడు. జమిందారు దినపత్రికలోనుంచి తలెత్తి- "ధర్మన్నా!" అని పిలిచాడు.

"ఏం బాబు?"- అంటూ వినయంగా ధర్మన్న ప్రశ్నించాడు, యజమానిని.

"చిన్నబ్బాయిగారు బడినుంచి యింకా రాలేదా?"-అని ఆయన ధర్మన్నని అడిగాడు.

"లేదు, బాబయ్యా! వెళ్లి తీసుకువస్తాను!" అంటూ ధర్మన్న వీధి ద్వారం దిశగా రెండడుగులు వేసాడో లేదో? సరిగ్గా ఆ సమయంలోనే ... వీధి ద్వారంలోనుంచి పంతులుగారు ప్రవేశిస్తూ- "నమస్కారం! మహా ప్రభో! నమస్కారం!" అన్నాడు.

"రా ! గోవిందయ్యా! ఏమిటి విశేషం?"- అని జమిందారు సాదరంగా, ఆ అయ్యవారిని ప్రశ్నించాడు.

"మహాప్రభూ! నా కీపూరు వద్దు! ఈ ఉద్యోగమూ వద్దు! ఇహ నా వల్ల కాదు! సెలవిప్పిస్తే, వెళ్లిపోతాను!"-అంటూ గోవిందయ్య శిరసొంచి, నొసట చేతులు జోడించాడు.

"అంత అవసరం ఏమొచ్చింది, గోవిందయ్యా?"- నారాయణరావు అయ్యవారి తీరుకి విస్తుపోతూ అడిగాడు. అలా అడుగుతూనే, రక్తం కారే గాయాలతో, పంతులు చెంతనున్న పిల్లలకేసి ఆందోళనగా చూస్తూ "ఏమిటిదంతా?" అని అడిగాడు. గోవిందయ్య తన మొరను వినిపించసాగాడు-

"అదే మనవి చేద్దామని వచ్చాను! ఈ భోగన్న లెక్కచెప్తూ ఉంటే, చిన్నబ్బాయిగారు వింటున్నట్టే వింటూ, వీణ్ణి సున్నపు గుట్టలోకి పల్టీ కొట్టించి, తుర్రుమన్నారు. రమ్మని కబురు పంపితే, పిల్లల్ని రాళ్లతో యీ విధంగా పూజించారు!"-

జమిందారు మొహం చిన్నబోయింది. "హూఁ! ఇప్పుడెక్కడికెళ్లారో తెలుసా?"- అంటూ గోవిందయ్యని ఆయన అడిగాడు.

"ఒక్కచోటేమిటి? ఊరంతా వారిదే! ఎక్కడో కోతి కొమ్మచ్చులాడుతూ వుంటారు!" అని విన్నవించాడు.

"సరే! వారిని మేము మందలిస్తాము! నువ్వు సెలవు తీసుకోవచ్చు!"- అని హుందాగా ఆయన చెప్పాడు.

గోవిందయ్య, బడి పిల్లలు - జమీందారుగారికి మరోమారు నమస్కరించి, అక్కడి నుంచి వెళ్లిపోయేరు. నారాయణరావు ఏదో ఆలోచిస్తూ, చేతిలోని దినపత్రికను ప్రక్కనపడేసి, చేతి కర్రను తీసుకొని, లేచి నిలబడ్డాడు. ఆ తరువాత -

"ధర్మన్నా!" - అని జమీందారు పిలిచాడు.

"బాబూ!" - అని ధర్మన్న యజమానికేసి చూసేడు.

"చిన్నబ్బాయిగారిని వెతికి తీసుకురా!" - అంటూ యజమాని ఆదేశం. "చిత్తం!" - అని ధర్మన్న సమాధానం. దేవదాసుని అన్వేషించడం కోసం ధర్మన్న బయటికి బయల్దేరాడు.

✣ ✣ ✣

నీలకంఠం యింట్లో... నీలకంఠం మంచం మీద గాఢనిద్రలో ఉన్నాడు. నీలకంఠం తల్లి, అతని భార్యా మధ్యాహ్నం వేళ కాస్త తీరిక దొరకడంతో, కాలక్షేపం కోసం, వైకుంఠపాళి ఆడుకోసాగారు. ఇంతలో... వంటింట్లో ఏదో 'దబ్బు'మని పడిన శబ్దం వారికి వినవచ్చింది. అత్తగారి నుంచి గవ్వలను అందుకొని, పందెం వేయబోతూన్న కోడలు విసుగూ, కోపం కలగలిపిన స్వరంతో -

"అబ్బబ్బ! పాడు పిల్లులతో పడలేకుండా ఉన్నాము! క్షణంసేపు కూర్చోనివ్వవు!" - అంది అత్తగారితో.

"వాటి కడుపాత్రం వాటిది! మన జాగ్రత్తలో మనము ఉండాలి! పోయిరా!" - అంటూ కోడలిని ఆ అత్త పంపించింది, పిల్లులను వెనకేసుకొని వస్తూ. కోడలు గవ్వలను క్రింద పడేసి, నడుం బిగించి, వంటింట్లోకి అడుగుపెట్టింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Devadasu+Cinema+Novel**

* * *